క్లుప్తంగా

రక్తదానంలో ముందుండాలి



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆత్మకూరు: యువకులు రక్త దానం చేయడంలో ముందుండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి నరసయ్య సూచించారు. శుక్రవారం కళాశాలలో వైద్యధికారి రాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్, డాక్టర్ మాట్లాడుతూ రక్తం ఏ గ్రూపునకు చెందినదో, హిమోగ్లోబిన్ శాతం ఎంతుందో ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతీబాయి, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు, మందులు

ఆత్మకూరు: అన్ని ఆర్బీకేల్లో విత్తనాలు, మందులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. శుక్రవారం ఆత్మకూరు అర్బన్ ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈక్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పని సరి చేయించుకోవాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి బైరాపురం మహబూబ్ బాషా, కౌలు రైతు సలహా సంఘం అధ్యక్షుడు తపాలా శ్రపాలి, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణం కాపాడుదాం



ముష్టపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

ఆత్మకూరు రూరల్: ప్రకృతిలో భాగమైన వన్య ప్రాణులను కాపాడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని బైర్లూటి రేంజర్ రామకోటి కోరారు. వన్య ప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముష్టపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనుమతి లేకుండా అడవుల్లో ప్రవేశించడం నేరమని, వన్య ప్రాణులకు హాని కలుగజేస్తే శిక్షించబడతారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ సుభాష్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, ప్రొటక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని తాటిపాడు రైతుభరోసా కేంద్రంలో శుక్రవాం సబ్సిడీ శనగ విత్తనాలను రైతులకు అందజేశారు. 20 కిలోల బ్యాగు ధర రూ.1,620 కాగా రాయితీ రూ.648 పోనూ రైతులకు రూ.972 అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ అబ్దుల్‌అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు విత్తనాలు ఇవ్వాలి

నందికొట్కూరు రూరల్: కౌలు కార్డు కలిగిన ప్రతి రైతుకు అధికారులు సబ్సిడీ విత్తనాలను అందజేయాలని మల్యాల రైతులు ఏఓ షేక్షావలిని కోరారు. శుక్రవారం మండలంలోని మల్యాల గ్రామంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సబ్సిడీ శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు పాల్గొన్నారు.

క్రీడల్లో ఉన్నతంగా రాణించాలి



విద్యార్థినికి క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, శాతనకోట సర్పంచ్ జనార్దన్‌గౌడ్ సూచించారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలోని 15 మంది కబడ్డీ క్రీడాకారిణులకు వారు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి, మండ్ల రాజు పాల్గొన్నారు.

పంటలు కాపాడుకోండి

కొత్తపల్లి: వాతావరణ మార్పుల కారణంగా బొప్పాయి పంటను వైరస్ తెగులు ఆశించే అవకాశం ఉందని, వ్యవసాయ అధికారుల సూచలనలు పాటించి పంటను కాపాడుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి కె.చందన సూచించారు. శుక్రవారం పెద్దగుమ్మడాపురంలో బొప్పాయపంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

సురక్ష శిబిరాలు పేదలకు వరం

● ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం లాంటివని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని సచివాలయం -1 లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఇటీవల ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి హెల్త్ చెకప్‌లు చేసి 1,200 మందిని గుర్తించారు. వారికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్లు ఎ.స్ఫూర్తితేజ , ఎ.బుజ్జిరెడ్డి, బి.మహేశ్వరరెడ్డి, ఎస్ లీల, జె.విజయరెడ్డి, ఆఫ్తమాలజీ అసిస్టెంట్ సి.గోవింద్‌రాజులు, క్షయవ్యాధి సూపర్‌వైజర్ రవికుమార్ వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం ఉచిత ఆపరేషన్లు అవసరమైన వారిని వారు కోరుకున్న ఆస్పత్రుల్లో వైద్యం చేయించేందుకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాపత్రయ పడుతున్నారన్నారు. అందులో భాగంగానే ప్రత్యేక వైద్యులతో పరీక్షలు నిర్వహించేదుకు ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్రసింగ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ వరప్రసాద్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.కుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, బీసీ సెల్ కార్యదర్శి, మండల అధ్యక్షులు జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ప్రవీణ్ దివ్యతేజ, టీఎండీ రఫి, పంచాయితీ సెక్రటరీ బాలునాయక్ పాల్గొన్నారు.

● **చంద్రబాబుపై సానుభూతి లేదు**

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పట్ల ప్రజల్లో సానుభూతి లేదని, సొంత పార్టీ వారే స్వప్రయోజనాల కోసం ప్రదర్శనలు చేస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. అవినీతి చేసి జైలుకు వెళ్లినప్పుడు ఇది అన్యాయం అంటూ గగ్గోలు పెడుతున్న తెలుగు దేశం పార్టీ నేతలు గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి 16 నెలల పాటు రిమాండ్‌లో ఉంచినప్పుడు ఏమైందన్నారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం పనిచేస్తుందన్నారు.

వెలుగోడులో..

వెలుగోడు: పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, నాయకులు, కార్యకర్తలు శిబిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, పట్టణ అధ్యక్షులు ఎం ఇలియాస్‌ఖాన్, ఉప సర్పంచ్ ముబీనా, షంషీర్, రామ్మోహన్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యర్రగుంట్లలో

మహానంది: బండిఆత్మకూరు మండలం యర్రగుంట్లలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. యర్రగుంట్ల క్యాంపులో 593 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళ్లూరి శ్వేతాకుమారి, ఎంపీటీసీ మైఖేల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమసింహనాయక్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మధుమోహనరెడ్డి, కాళ్లూరి బాలన్న పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

● ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



రుద్రవరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. అందులో భాగంగానే నిపుణులైన వైద్యులను గ్రామాలకు పంపి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నారన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచు రామస్వామి, డాక్టర్లు నాగలక్ష్మిదేవి, ఎంఈఓ బాలాజీనాయక్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ జుబేర్, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితప్రభావతి, కో ఆప్టెడ్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాములమ్మ, మధుసూదన్‌రావు, శివలింగం, రాజన్న పాల్గొన్నారు.

తంగడంచ గ్రామంలో..

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే ఆర్థర్ పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. కంటి పరీక్షలు, ఈసీజీ తదితర 7 రకాల పరీక్షలు చేయించుకోవటంతో పాటు మెరుగైన వైద్యం పొంది ఆరోగ్యాంగా ఉండాలన్నారు. అనంతరం పలువురికి కంటిఅద్దాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీపీ, షుగర్ చెకప్ చేయించుకున్నారు. మెరుగైన వైద్యం కోసం పలువురిని కర్నూలుకు రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారిణి శారద, డాక్టర్లు గంగాధర్, యశ్విని, శారద, మధునాయక్, సర్పంచ్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమణమ్మ, జెడ్పీటీసీ జిల్లా జాయింట్ సెక్రెటరీ తిరుమలేశ్వరరెడ్డి, జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

గువ్వలకుంట్లలో..

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచు మశమ్మ పాల్గొన్నారు. ప్రజలను ఆరోగ్యంగా ఉంచేందకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నా రు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహిచి అవసరమైన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం చేయి స్తోందన్నారు. అనంతరం వైద్యులు విజయేంద్ర వర్మ, దీపానాగవేణి, జూబేద, సీహెచ్ఓ బాలకృష్ణ తదితర ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందజేశారు. చదరంపెంట, పాలెంచెరువు గూడె ల గిరిజనులకు డాక్టర్ వినోద్‌కుమార్ భోజన వస తి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, నాగంపల్లి సింగిల్‌విండో చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, కో-ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్‌గౌస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్యలు పాల్గొన్నారు.



వృద్ధులకు కంటి అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

బీపీ, షుగర్ ఉందని చెప్పారు



రక్త పరీక్షలు చేసి బీపీ, షుగర్ ఉందని చెప్పి, మందులు ఉచితంగా ఇచ్చారు. ప్రతి నెలా ఇస్తామని డాక్టర్లు చెప్పారు. పెద్ద డాక్టర్లు మా గ్రామానికి వచ్చి రక్త పరీక్షలు చేసి రోగాలు తెలియజేసి, మందులు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– వెంకటలక్ష్మమ్మ, రుద్రవరం, పాములపాడు మండలం

ఖర్చు లేకుండా వైద్యం



నాకు 80 ఏళ్లు. కీళ్లనొప్పులు, తలనొప్పి, కంటిచూపు సమస్యలు ఉంటే చూపించుకున్నాను. పైసా ఖర్చులేకుండా రక్త పరీక్ష, గళ్ల పరీక్ష, బీపీ, షుగరు చేశారు. డాక్టర్లు నిదానంగా అర్థమయ్యేలా వివరించారు. మందులు కూడా ఉచితంగానే ఇచ్చారు. చాలా సంతోషం

– చెరుకు నాగమ్మ, వీరాపురం, కొత్తపల్లి మండలం

● **మల్యాల గ్రామంలో..**



మల్యాల మెడికల్ క్యాంపులో రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్: పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో అధికారులు, నాయకులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రామనికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగనన్న ఆకాంక్ష అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. అనంతరం శిబిరంలో ఎంపీపీ రక్త పరీక్షను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గువ్వలకుంట్లలో బాలుడికి చెకప్ చేస్తున్న డాక్టర్

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి మూర్తులను విశేషంగా అలంకరించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు ఉంచి ఆలయ ప్రాకారంలో పల్లకోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

'గురుకులం' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల అధ్యాపకులు

జూపాడుబంగ్లా: గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావటంతో పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, పీడీ భాస్కర్‌రెడ్డి వారిని అభినందించారు. శుక్రవారం కర్నూలులో జరిగిన ఈత పోటీల్లో పాఠశాలకు చెందిన జూనియర్ బైపీసీ విద్యార్థి శరత్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అలాగే మరో ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు, 20 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు.

పాములపాడు ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు..

పాములపాడు: తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయుడు సాయిక్రిష్ణతో కలిసి విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అండర్-19 వాలీబాల్ విభాగంలో స్ఫూర్తి, సాఫ్ట్ బాల్‌లో సుమంత్, అంబేడ్కర్, నెట్ బాల్‌లో నబీరసూలు, రవి, త్రో బాల్‌లో హేమంత్, అర్జున్, మహేష్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 17 విభాగంలో త్రోబాల్‌లో మనోజ్, కోనపల్లి చరణ్, 400 మీటర్ల పరుగు పందెంలో చరణ్, అండర్ -14 విభాగం త్రో బాల్‌లో ఈశ్వర్ ఎంపికయ్యాడన్నారు.



జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు

ముస్లిం కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేత చేయూత



మహబూబ్‌బాషాను పరామర్శిస్తున్న పెద్ద పక్కీరయ్య

మహానంది: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ ముస్లిం కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేత చేయూతనిచ్చారు. గాజులపల్లెకు చెందిన మహబూబ్ బాషా కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ఏపీ మదాసి కురువ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ గజ్జ పెద్ద పక్కీరయ్య తన వంతుగా రూ.4 వేల ఆర్థిక సాయంతో పాటు వంద కిలోల బియ్యం అందించి అండగా నిలిచారు. అలాగే వైఎస్సార్ బీమా చేయించి, బ్యాంకులోనూ బీమా ప్రీమియం చెల్లించడంతో పక్కీరయ్యను గ్రామస్తులు అభినందించారు.

శ్రీశైలంలో అద్భుత తీర్థాలు

● సామవేదం షణ్ముఖ శర్మ



ప్రవచనాలు వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని ఆలయ ప్రాంగాణం, ఆలయ పరిసరాల్లో అద్భుతమైన తీర్థాలు ఉన్నాయని, వాటి దివ్యత్వాన్ని పురాణాలు ఎంతగానో వర్ణించాయని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తెలిపారు. శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఆయన శ్రీశైల మహిమా విశేషాలపై ఆరవ రోజు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బాలుడు దొరికాడు

మహానంది: పిల్లలతో కలిసి ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు శివకేశవులు అదృశ్యమైన విషయం తెలిసిందే. తప్పిపోయి ఓ ముళ్లపొదల్లో ఉన్న పిల్లాడిని స్థానికులు, పోలీసులు గుర్తించారు. దీంతో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

మిడుతూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు చేయవచ్చని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం యూనియన్ బ్యాంకు వారు పేటీఎం సంస్థ సహకారంతో అన్ని గ్రామ పంచాయతీలకు పీఓఎస్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌లను ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. ఏఓ సురేస్‌కుమార్ పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

కొత్తపల్లి: మండల పరిధిలోని దుద్యాల గ్రామ రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ శోభలత ఆధ్వర్యంలో రైతులకు ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ మహేష్ పాల్గొన్నారు.

నేడు వేంపెంటలో సురక్ష శిబిరం

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఉంటుందని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోపవరంలో..

మహానంది: గోపవరంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గోపవరంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే బండిఆత్మకూరు మండలం పెద్దదేవలాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు.

జలకనూరులో..

మిడుతూరు: జలకనూరులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరుకానున్నారన్నారు.

సాక్షి గణపతి ఆలయం వద్ద 10 ఎకరాల్లో పార్కింగ్

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: అటవీశాఖ సహకారంతో సాక్షి గణపతి ఆలయం వద్ద 10 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం అటవీశాఖ పీసీసీఎఫ్‌తో ఈ విషయమై చర్చించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే శ్రీశైలం, సున్నిపెంట స్థానికులకు టోల్‌గేట్ రుసుం నుంచి మినహాయింపు ఇవ్వాలని కూడా అభ్యర్థించానని, ఓన్‌బోర్డు వాహనాలకు మినహాయింపు ఇస్తానని, ట్యాక్సీ బోర్డు వాహనాలు రుసం చెల్లించాల్సి ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపినట్లు చెప్పారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో చర్చించాల్సి ఉందన్నారు. శ్రీశైలం వచ్చేందుకు ఆత్మకూరు వద్ద బైర్లూటీ, దోర్నాల, శ్రీశైలం వద్ద టోల్‌గేట్ వసూలు చేస్తున్నారని, ఇటు హైదరాబాద్ నుంచి వస్తే లింగాలగట్టు వద్ద అటవీశాఖ టోల్ గేట్ వసూలు చేస్తోందని ఇందువల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, 24గంటల్లో ఏ టోల్‌గేట్ నుంచి వెళ్లినా ఒక రుసుం మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేంద్ర అటవీశాఖ అనుమతులతో దోర్నాల నుంచి శ్రీశైలం వరకు డబుల్ రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: స్థానిక శివాజీ స్ఫూర్తి కేంద్రం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఎస్‌బీఎంఎస్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో తలపడుతున్న ఇరుజట్ల క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకుని, బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. టోర్నమెంట్‌లో 22 క్రికెట్ జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు యల్లా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

హక్కులు సాధించుకోవాలి

పగిడ్యాల: హక్కుల సాధనకు ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రామదాసు సూచించారు. దేవనగర్ కాలనీలో శుక్రవారం కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధకచట్టాన్ని నీరుగార్చేందుకు 41సీఆర్పీసీ ప్రకారం బెయిల్ ఇవ్వటాన్ని వ్యతిరేకించాలన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, హత్యలు, దాడులపై నమోదయ్యే కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా పరిష్కరించాలని ఆయన కోరారు. జస్టిస పున్నయ్య కమిషన్ సిఫారసులను పకడ్బందీగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గంగా హుసేనమ్మ పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోల్ బంక్ మంజూరు

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో పోలీసుపెట్రోల్ బంక్ మంజూరైనట్లు పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నారు. గతేడాది జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌ను తనిఖీచేసి పోలీసుస్టేషన్ ఆవరణలోని స్థలాన్ని పరిశీలించి పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలం అనువుగా ఉన్నందున విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లి పెట్రోల్ బంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని వెల్లడించారు. అందులో భాగంగా జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌కు అత్యంత సమీపంలో హైవే రోడ్డు వెళ్లనున్నండటంతో పెట్రోల్ బంక్ ఏర్పాటుచేస్తే బాగుంటుందనే ఉద్దేశంతో పెట్రోల్ బంక్ మంజూరు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్వరలో పెట్రోల్ బంక్ నిర్మాణం కార్యరూపం దాల్చే అవకాశాలున్నాయి. పెట్రోల్ బంక్ ఏర్పాటుచేస్తే జూపాడుబంగ్లా, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పెట్రోల్, డీజిల్ కోసం పడే కష్టాలు తీరనున్నాయి.